క్లుప్తంగా

న్యాయవాద పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాద పరిషత్ క్యాలెండర్‌ను నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఒకే దేశం, ప్రజలందరూ సమానమే అనే సిద్ధాంతం ప్రాతిపదికన న్యాయవాద పరిషత్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, సభ్యులు దయావార్ నగేశ్, బిట్ల రవి, బండారి కృష్ణానంద్, కిరణ్ కుమార్, భానుచందర్, స్నేహ, లిల్లీ, నరేశ్‌కుమార్, వసంత్ రావు, ఆశనారాయణ, శరత్ చంద్ర, రణదీశ్, శ్రీహరి ఆచార్య, వేణు, మాణిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీఎఫ్ డైరీ..



నిజామాబాద్‌నాగారం: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(పీఎంపీఎఫ్) జిల్లా డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కోదండరాం, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం మోహన్, లక్ష్మీరాజం, రవివర్మ, జితేందర్, దశరథ్, శ్రీనివాస్, శ్యాం, అశ్వక్ అలీ, సాయిలు, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



సిరికొండ: మండలంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి ప్రతినిధి శ్రీనివాస్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పేద విద్యార్థులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి షేక్ పర్వీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో శుక్రవారం శ్రీ భూనీళా సమేత బంగారు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితులు యజ్ఞం నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఎంపీలపై కక్ష తగదు

డిచ్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీలపై కక్షసాధింపు తగదని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్ట అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆర్ఎంపీ, పీఎంపీలు అందిస్తున్న వైద్యసేవలను గుర్తించిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జీవో నంబర్ 429 ద్వారా అర్హులైన వారికి శిక్షణలు ఇచ్చారని పేర్కొన్నారు. పీఎంపీ, ఆర్ఎంపీలపై దాడులు, కేసులు చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో పీఎంపీలు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

సిరికొండ: మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్ఎం రాజేశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన టెస్ట్‌లో పదో తరగతి విద్యార్థులు ఎస్ నందిని ప్రథమ, డి యశ్వంత్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం, ఫిజికల్ సైన్స్ టీచర్ సామిత్రి అభినందించారు.

పీసీసీ అధ్యక్షుడికి ఆహ్వాన పత్రిక అందజేత

నిజామాబాద్ రూరల్: నగరంలోని అమ్మవెంచర్‌లో నిర్మించనున్న వారాహీమాత ఆలయ శంకుస్థాపన కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కి ఆలయ కమిటీ ప్రతినిధి మంచాల జ్ఞానేందర్ శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఫిబ్రవరి 10న నిర్వహించనున్న ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆయనకు వారాహీమాత చిత్రపటాన్ని బహూకరించారు.

వంద శాతం లక్ష్యాన్ని సాధించాలి

- మున్సిపల్ ప్రాజెక్టు అధికారి రమేశ్
- మహిళా సంఘాల రుణాలపై ఆర్పీలతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని, వంద శాతం లోన్లు పూర్తిచేయాలని మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ఎస్ఎల్ఎఫ్ మహిళా సంఘ భవనంలో ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ రుణ లక్ష్యాలు సాధించడంతోపాటు మెప్మా కింద ఇచ్చే రుణాలు, వీధివ్యాపారులకు ఇచ్చే లోన్లు, ఇందిరా మహిళా శక్తి గ్రూపులకు ఇచ్చే రుణాలు పూర్తి చేయాలన్నారు. రెండు నెలల్లో రుణ టార్గెట్ పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా ఎండీ మెప్మా ఆర్పీల పనితీరుపై నివేదిక సమర్పించాలని సూచించారని పేర్కొన్నారు. సమావేశంలో టీఎంసీ శోభ, సీవోలు అశోక్, లావణ్య, ఆర్పీలు, టీఎల్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అటకెక్కిన చెత్త శుద్ధి

- నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు
- గ్రామాలకు దూరంగా నిర్మాణం
- నిర్వహణపై దృష్టి సారించని అధికారులు



మైలారంలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

ధర్పల్లి: గ్రామాలను శుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం జిల్లాలోని ప్రతి జీపీ పరిధిలో కంపోస్టు షెడ్లను నిర్మించింది. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రతి రోజు నివాస ప్రాంతాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్టు ఎరువుగా మార్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో కంపోస్ట్ షెడ్లను ఏర్పాటు చేసింది. ఆశించిన స్థాయిలో ఈ కార్యక్రమం అమలు కాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్‌లు ప్రస్తుతం వృథాగా పడి ఉన్నాయి.

తయారు కాని కంపోస్టు ఎరువు

జిల్లాలో(కొత్తగా ఏర్పడిన 15 జీపీలు కాకుండా)530 జీపీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు వాటర్ ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో ఇంటింటికి చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేశారు. కానీ చాలామంది తడి, పొడి చెత్తను వేరు చేయకుండా అందిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని వేరుచేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువులను గ్రామపంచాయతీ విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే వీటి ఉద్దేశం. కానీ గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు లేవు.

చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

ఒక్క కంపోస్టు షెడ్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 2.5 లక్షలు ఖర్చు చేసింది. కానీ జీపీలు ఈ షెడ్లను ఉపయోగించడం లేదు. ఇళ్ల నుంచి సేకరించిన ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వ్యర్థాలను వేరుచేసి ఎరువుగా మారే పదార్థాలను కంపోస్టు గుంతల్లో వేస్తారు. సేంద్రియ ఎరువుగా మారిన అనంతరం గ్రామపంచాయతీల పరిధిలో హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీలతో పాటు రైతులకు అందించాలని నిర్దేశించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, గాజు సీసాలు, ఇతర వస్తువులను విక్రయించడం ద్వారా జీపీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయని లక్ష్యంగా ప్రారంభించిన పథకం ఆచరణలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో అనుకున్న లక్ష్యం నీరుగారుతోంది.

సేంద్రియ ఎరువు తయారీపై..



మండలంలో అన్ని గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ సజావుగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కంపోస్ట్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించాం. షెడ్లలో పూర్తిస్థాయిలో సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు చేపడతాం.

– బాలకృష్ణ, ఎంపీడీవో, ధర్పల్లి

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

డిచ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. రైతులకు రూ. రెండు లక్ష రుణమాఫీ, మహిళలకు మహాలక్ష్మీ కింద నెలకు రూ.2500, కౌలు రైతులతో సహా భూమిలేని రైతులకు రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని అన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పూర్ భూమయ్య, జేపీ గంగాధర్, సుప్రియ, సాయినాథ్, గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వర్సిటీలకు నిధులు కేటాయించాలి



వీసీని సత్కరిస్తున్న అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఆచార్యుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ప్రొఫెసర్ కనకయ్య ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పదవీ విరమణ వయసు పెంపు జీవో విడుదలతో సీనియర్ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేయకుండా తెలంగాణ యూనివర్సిటీలో వైస్ ఛాన్స్‌లర్‌గా కొనసాగుతున్న యాదగిరిరావును టూటా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కనకయ్య, టూటా అధ్యక్షుడు పున్నయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీలపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ఉన్నత విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ అరుణ, టూటా ఉపాధ్యక్షుడు ఎం సత్యనారాయణరెడ్డి, కోశాధికారి అడికె నాగరాజు, ఈసీ మెంబర్లు జమీల్ అహ్మద్, మూసా ఖురేషి, ఎల్లోసా, బాలకిషన్, పాత నాగరాజు, సాయిలు, విద్యావర్ధిని, గులే రాణా, వాసం చంద్రశేఖర్, శిరీష, లక్ష్మణ చక్రవర్తి, సంపత్ తదదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలి



జయసింహగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ప్రస్తుత విద్యావ్యవస్థలో నూతన మార్పులు తీసుకురావాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరిరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా ట్రస్మా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి యాదగిరిరావు హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పరీక్షలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు, సందేహాలను తీర్చడానికి ఈ కమిటీలు తోడ్పడతాయని అన్నారు. ఇటీవల రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన జయసింహగౌడ్ కోశాధికారిగా నియమితులయ్యారు. అనంతరం ఆయనతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో ఈ నెల 7న చేపట్టే లక్ష డప్పులు–వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ కోరారు. శుక్రవారం పులాంగ్ చౌరస్తాలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాదిగా ఎమార్పీఎస్ నాయకులు హాజరు కావాలని కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణంలో పోస్టర్ల ప్రదర్శన చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, తెడ్డు గంగారాం, మారుతి, రాజేశ్, భూమయ్య, ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాహనదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎల్ రామ్

సిరికొండ: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఎల్ రామ్ సూచించారు.మండల కేంద్రంలో జాతీ య రోడ్డు భద్రత మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాల ను నడపాలని సూచించారు. మైనర్లకు వాహ నాలను ఇవ్వవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేగాం సాయన్న, దువ్వూరి సంతో ష్‌రెడ్డి,సిబ్బంది జీవన్, మధుకర్,శంకర్,కైలా స్, సంతోష్ పాల్గొన్నారు.

కిరణ్ కుమార్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం



ఎస్ఆర్ భవన్‌లో కిరణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ/ మోపాల్: వేములపల్లి కిరణ్ కుమార్ స్ఫూర్తితో ఉద్యమిద్దామని పీవైఎల్ నాయకుడు వనమాల సత్యం అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎస్ఆర్ భవన్‌లో కిరణ్ కుమార్ వర్ధంతి సభ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కిరణ్ యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల కోసం పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, దేవిక, రాజు, శివకుమార్, మోహన్, శంకర్, రమేశ్, పాసికంటి రాజు పాల్గొన్నారు. మోపాల్‌లో వేములపల్లి కిరణ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా పీవైఎల్ నాయకుడు దండు మహేశ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. యువత మద్యానికి, డ్రగ్స్‌కు బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబాగౌడ్, సాయాగౌడ్, గంగమల్లు, నారాయణ, రాజు, గంగారాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



ఎస్‌బీబీ సీఐ సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న డీసీపీ బస్వారెడ్డి

ఖలీల్‌వాడి: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని డీసీపీ బస్వారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన ఎస్‌బీబీ సీఐ ఎన్ సత్యప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో ఎంతో పని ఒత్తిడి ఉంటుందని, ఎలాంటి రిమార్క్‌లు లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఎస్‌బీబీ సీఐ ఎన్ సత్యప్రసాద్ 40 ఏళ్లుగా పోలీస్‌శాఖలో పని చేస్తూ ఎలాంటి రిమార్క్ లేకుండా పని చేశారని తెలిపారు. కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు పదోన్నతులు పొందారని, దీంతోపాటు సేవాపతకం, పలు రివార్డులు పొందారని అన్నారు. కార్యక్రమంలో సీపీ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, ఎస్బీ సీఐ శ్రీశైలం, రిజర్వ్ సీఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ పనిచేయక అవస్థలు



టవర్ వద్ద గ్రామ యువకులు

సిరికొండ: మండలంలోని పాకాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్ పని చేయకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. పాకాల గ్రామం దట్టమైన అడవుల్లో ఉంటుంది. ఆ గ్రామానికి ఏ సెల్ ఫోన్ సిగ్నల్స్ అందవు. గ్రామస్తులు ఎన్నో ఏళ్ల నుంచి విన్నవించగా నాలుగు నెలల క్రితం బీఎస్ఎన్ఎల్ వారు టవర్‌ను ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి ఆ టవర్ పని చేయకపోవడంతో సిగ్నల్స్ నిలిచిపోయాయి. టవర్‌కు మరమ్మతులు చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు విన్నవిస్తే పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.టవర్‌కు మరమ్మతులు చేపట్టి సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 75 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కలిగోట స్రవంతి క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం స్రవంతిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	84,000	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	76,780	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	90	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40, 4.40, 7.25, 10.00
స్క్రీన్-3	ఏజెంట్ గై 001(తెలుగు)-11.00 4.40 మదగజరాజ(తెలుగు)-1.30 ,7.30 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	మదగజరాజ(తెలుగు)-10.10 10.45 డాకు మహారాజు (తెలుగు)-1.20 7.40 - దేవా(హిందీ)-4.25
స్క్రీన్-3	దేవా(హిందీ)-10.45 7.15 10.30 మహిష(తెలుగు)-2.00 రొమాంటిక్ లైఫ్(తెలుగు)-4.30
స్క్రీన్ -4	ఏజెంట్ గై001(తెలుగు)-11.15 స్కై ఫోర్స్(హిందీ)-1.30 10.25 మదగజరాజ(తెలుగు)-4.15 ప్రేమిస్తావా(తెలుగు)-7.25
లలితామహల్	మదగజరాజ (తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	రాచరికం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)